## నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 9 : ఉమ్మడి జిల్లాలో బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు వెబ్ సైట్ tgbestudycircle.cgg.gov.inలో ఈ నెల 24 వరకు అప్లయ్ చేసుకోవాలన్నారు. ఎంపికైన 100 మందికి హైదరాబాద్‌లోని కుషాయిగూడలో ఎలీ హోప్ టెక్నికల్ స్కిల్స్ అకాడమీ ఆధ్వర్యంలో 90 రోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ తర్వాత అకాడమీ వారే ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు. శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి నెలకు రూ. 4 వేల చొప్పున భృతిని అందిస్తుందన్నారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన 18 నుంచి 25 ఏళ్ల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబ వార్షికాదాయం రూ. 5 లక్షలలోపు ఉండాలన్నారు. వివరాలకు 0878 2268686లో సంప్రదించాలని చెప్పారు.

## ఐపీపీబీతో ఎస్సారార్ కాలేజీ ఎంవోయూ




కమాన్‌చౌరస్తా, ఆగస్టు 9 : కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ అటనామస్ కళాశాల కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం కరీంనగర్‌లోని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు(ఐపీపీబీ) శాఖతో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ యాంసాని సత్యనారాయణ, ఐపీపీబీ తెలంగాణ సర్కిల్ చీఫ్ మేనేజర్ భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో కామర్స్ విభాగాధిపతి టీ రాజయ్య, కరీంనగర్ ఐపీపీబీ బ్రాంచ్ మేనేజర్ తొర్తి రమేశ్ అవగాహన ఒప్పంద పత్రాలను పరస్పరం బదిలీ చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ అవగాహన ఒప్పందం ద్వారా కళాశాల బీకాం బీబీఏ, బీకాం ఫైనాన్స్, బీకాం బిజినెస్ అనలిటిక్స్ విద్యార్థులు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకులో 1 నుంచి 6 నెలల వరకు ఇంటర్న్‌షిప్ సదుపాయం, పోస్టుల భర్తీ విషయంలో విద్యార్థులకు ప్రాధాన్యత, క్షేత్రస్థాయి పర్యటన అవగాహన సదస్సులు, తదితర ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. ఇక్కడ మేనేజర్ కొల గూరి రేవతి, బ్యాంక్ ప్రతినిధి రమేశ్, అధ్యాపకులు మల్లారెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసరెడ్డి, హర్ జ్యోత్ కౌర్, బూర్ల నరేష్, అర్జున్, శిరీష, అరవింద్, నర్మద, రాములు, మల్లేశం, ఐలయ్య, పూర్ణచందర్, అభిలాష్, విద్య ఉన్నారు.

# పెద్దాపూర్ గురుకులంలో మృత్యుఘోష

- పదిహేను రోజుల క్రితం ఓ విద్యార్థి మృత్యుఒడికి.. మరో ఇద్దరికి అస్వస్థత
- తాజాగా మరో బాలుడు మృతి.. ఇద్దరు చిన్నారుల పరిస్థితి విషమం
- పాము కాటే కారణమనే అనుమానాలు
- గురుకులంలో ఎటు చూసినా అసౌకర్యాలే
- పాఠశాల, వసతిగృహం చుట్టూ భయంభయమే
- ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు.. పాముల సంచారం
- తల్లిదండ్రుల్లో ఆందోళన



మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లోని బాలుర గురుకుల పాఠశాల



ఎల్లారెడ్డిపేట: బొప్పాపూర్‌లో అనిరుధ్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, ఇన్‌సెట్‌లో అనిరుధ్ (ఫైల్)

**ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు కలిగిన పెద్దాపూర్ బాలుర గురుకులంలో మృత్యుఘోష వినిపిస్తున్నది. సౌకర్యాల లేమి, పాలకుల చోద్యం, అధికారుల అలసత్వం పిల్లల ప్రాణాలను బలిగొంటున్నది. పదిహేను రోజుల క్రితం ఓ విద్యార్థి మృతిచెందిన విషయం మరిచిపోకముందే, శుక్రవారం మరో విద్యార్థి చనిపోవడం, ఇంకో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడం భయాందోళన కలిగిస్తున్నది. వరుస ఘటనలకు పాముకాటే కారణమన్న అనుమానాలు బలంగా కనిపిస్తుండగా, విద్యార్థులు వణికిపోవాల్సి వస్తున్నది. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు ఉండడం, పాముల సంచారం ఉండడంతో ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉన్నది. దీనిపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తమ పిల్లల భవిష్యత్ కోసం పంపామని, ఇలా చంపుకోవడం కోసం కాదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

జగిత్యాల, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ)/ మెట్‌పల్లి/ మెట్‌పల్లిరూరల్ : మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలకు జగిత్యాల జిల్లాలోనే కాదు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అత్యంత ఘనమైన చరిత్ర కలిగి ఉంది. 1983లో దీనిని ఏర్పాటు చేయగా, కాలగమనంలో జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ అయింది. 40 ఏండ్ల కాలంలో వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దింది. ప్రస్తుతం పెద్దాపూర్ గురుకులంలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు విద్యాబోధన కొనసాగుతుండగా, 540 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలోనే ఈ గురుకులంలో ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం, మరో నలుగురు విద్యార్థులు తీవ్ర అస్వస్థత చెందడం కలకలం రేపుతున్నది.

### నెల వ్యవధిలోనే ఇద్దరు పిల్లలు మృతి

గత నెల 26న గురుకులంలో 8వ తరగతి చదువుతున్న రాజారపు గణాదిత్య(13)తోపాటు ఆడెపు గణేశ్, రాపర్తి హర్షవర్ధన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులతో పాటు కడుపునొప్పితో తల్లడిల్లారు. గురుకుల సిబ్బంది ఆ పిల్లలను ఆలస్యంగా దవాఖానకు తరలించగా, గణాదిత్య మృతిచెందాడు. మిగిలిన ఇద్దరు విద్యార్థుల పరిస్థితి సైతం విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు తరలించగా, కొద్దిరోజులకు వారు కోలుకున్నారు. పాముకాటుకు గురికావడంతోనే గణాదిత్య మృతి చెందాడని, మరో ఇద్దరు విద్యార్థులు అస్వస్థత చెందారని అనుమానించారు. అప్పుడు భయాందోళనకు గురైన తల్లిదండ్రులు గురుకులంలో ఉన్న తమ పిల్లలను స్వగ్రామాలకు తీసుకువెళ్లారు.

పదిపదిహేను రోజుల తర్వాత ఇప్పుడిప్పుడే కొద్ది మంది విద్యార్థులు గురుకులానికి చేరుకున్నారు. అయితే, ఇంతలోనే గురువారం రాత్రి 6వ తరగతి చదువుతున్న ఎద్మల అనిరుధ్(11)తో పాటు హేమంత్‌యాదవ్, మోక్షిత్ తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. వారిని దవాఖానకు తరలించగా, అనిరుధ్ పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై కోరుట్ల పోలీసులు, అధికారులు పాఠశాలకు చేరుకొని విచారణ జరిపారు. అలాగే, జగిత్యాల ఇన్‌చార్జి డీఈవో జనార్దన్‌రావు సైతం స్కూల్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. పాఠశాల తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు.

### ప్రాథమిక చికిత్స కరువే..

ఇరవై రోజుల క్రితం ఇక్కడి నర్సింగ్ ఆఫీసర్ నిర్మల్‌కు బదిలీ అయింది. అనంతరం ఐదు రోజులకే ఓ విద్యార్థి ప్రాథమిక చికిత్స అందక ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. అప్రమత్తం కావాల్సిన అధికారులు నర్సింగ్ ఆఫీసర్ పోస్టును భర్తీ చేయడంలో నిర్లక్ష్యం వహించారు. ఈ క్రమంలోనే మరో విద్యార్థి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. సకాలంలో అనిరుధ్‌కు ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణాలు దక్కే అవకాశాలుండేవన్న అభిప్రాయా లు వ్యక్తమవుతున్నాయి. ఇటు రాత్రి పూట పనిచేసే ఇద్దరు కేర్ టేకర్లపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పిల్లలను సరిగ్గా పట్టించుకోవడం లేదని, ఒకవేళ ఏదైనా ఇబ్బంది ఉందని పిల్లలు చెబితే ఆగ్రహిస్తున్నారని, అందుకే వారికి చెప్పుకునేందుకు విద్యార్థులు భయపడుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అందుకే అనిరుధ్ రాత్రి 10 గంటల నుంచి తనకు కడుపు నొప్పి వస్తున్నా చెప్పుకోలేదని తెలుస్తున్నది. రాత్రంతా నొప్పితో తల్లడిల్లిపోయాడు. శుక్రవారం 5.30 గంటలకు ఎక్కువ కావడంతో తోటి విద్యార్థులు కేర్ టేకర్‌కు తెలిపారు. తీవ్ర అస్వస్థతతో ఉన్న అనిరుధ్‌ను వెంటనే 108 అంబులెన్స్‌లో జగిత్యాలకు తరలిస్తుండగా చనిపోయాడు. వాస్తవానికి కేర్‌టేకర్లు విద్యార్థులు బస చేసే గదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తే ఈ ఘటన జరిగి ఉండేది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



గురుకులం నుంచి ఇంటికి తరలివెళ్తున్న చిన్నారులు

### పిల్లలకు రక్షణేది?

ఉన్నతాధికారుల ఉదాసీన వైఖరి, గురుకుల సిబ్బంది నిర్లక్ష్యం వల్లే విద్యార్థులు మృత్యువాత పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెద్దాపూర్ గురుకులం పట్టణానికి, గ్రామానికి దూరంగా అటవీ ప్రాంతంలో ఉంటుంది. అయితే, పాఠశాల స్థాయి పెరగడం, భవనం పాతబడడంతో 2017లో ₹4.25 కోట్లతో 12 ఎకరాల స్థలంలో కొత్త భవనాన్ని నిర్మించారు. అది ఇంకా పూర్తి కాలేదు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. మొన్నటి వరకు శిథిలావస్థకు చేరిన పూర్వ భవనంలోనే విద్యాబోధన వసతి కొనసాగించారు. అయితే, గత నెలలో గణాధిత్య మృతిచెందడం, మరో ఇద్దరు అస్వస్థత చెందడం, తల్లిదండ్రుల నుంచి ఆగ్రహం వ్యక్తం కావడంతో విద్యార్థుల వసతిని అసంపూర్తిగా ఉన్న కొత్త భవనంలోకి మార్చారు. అయితే, పదిహేను రోజుల క్రితం జరిగిన ఘటనతో అప్రమత్తంగా ఉండాల్సిన నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే మరో విద్యార్థి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. నిజానికి పాఠశాల ఆవరణలో ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు ఉండడంతో భయంకరమైన వాతావరణం కనిపిస్తున్నది. కొత్త భవనం వెనకాలే పాడుబడ్డ బావి ప్రమాదకరంగా ఉన్నది. ఇక పూర్వ భవనానికి, కొత్త భవనానికి దాదాపు వంద మీటర్ల దూరంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉన్నాయి. చుట్టూ అంతా చెట్లు, పొదలే ఉన్నాయి. ఇప్పటికీ వాటినే విద్యార్థులు వాడుతున్నారు. చనిపోయిన అనిరుధ్ గురువారం రాత్రి మూత్రశాలకు వెళ్లి వచ్చాడని, అస్వస్థత చెందిన మరో ఇద్దరు విద్యార్థులు కూడా అలాగే వెళ్లి వచ్చారని తోటి విద్యార్థులు చెబుతున్నారు. మూత్రశాలల వద్ద పాము లేదా విషపురుగులు కరిచి ఉంటాయని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక అన్నింటికంటే దారుణమైన విషయం ఏంటంటే బెడ్స్‌ను పాతభవనంలో మూలకు పడేశారు. పిల్లలను గదుల్లో కిందే పడుకో బెడుతుండడంతో రాత్రిపూట పాము కాటుకు గురవుతున్నారని తల్లిదండ్రులు అనుమానిస్తున్నారు.

### తల్లిదండ్రుల ఆగ్రహం

గణాధిత్య చనిపోయిన సమయంలో ప్రిన్సిపాల్‌ను బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేశారు. అనిరుధ్ మృతి నేపథ్యంలో గురుకులాన్ని పరిశీలించిన అధికారులు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహిపాల్‌రెడ్డితో పాటు తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలల జిల్లా కమ్యూనిటీ ఆఫీసర్ శ్రీనివాస్‌కు కలెక్టర్ మెమో జారీ చేశారు. అయితే, ఈ చర్యలపై విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సస్పెన్షన్లు, మెమోలు జారీ చేసి చేతులు దులుపుకోవడం కాదని, గురుకులంలో పిల్లలకు రక్షణ కల్పించాలని స్పష్టం చేస్తున్నారు. కొత్త భవనం పూర్తి చేయించడంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాన్ని క్లీన్ చేసి ప్రహరీ నిర్మిస్తే ఈ పరిస్థితి వచ్చి ఉండేదని కాదని చెబుతున్నారు. అలాగే పిల్లలు పడుకునేందుకు బెడ్స్‌ను, డాక్టర్‌ను నియమించాలని స్పష్టం చేస్తున్నారు. అధికారుల కంటే ముఖ్యంగా ప్రభుత్వానిదే పెద్ద తప్పని విమర్శిస్తున్నారు.

### ప్రభుత్వ విప్ నిలదీత

విద్యార్థి మృతి విషయం తెలియడంతో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తోపాటు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గురుకులాన్ని సందర్శించారు. నూతన భవనంలో విద్యార్థుల గదులను పరిశీలిస్తుండగా, అక్కడికి వచ్చిన తల్లిదండ్రులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు, విద్యార్థుల మరణాలపై నిలదీశారు. పదిహేను రోజుల క్రితమే ఓ విద్యార్థి చనిపోతే ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. పిల్లలకు పడుకునేందుకు బెడ్లు లేవని, మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదులు దూరంగా ఉన్నాయని దృష్టికి తెచ్చారు. అప్పటికే అదనపు కలెక్టర్ రాంబాబు అక్కడికి రావడంతో సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని విప్ ఆదేశించారు.



పాఠశాల కొత్త భవనం వెనుక ప్రమాదకరంగా బావి



పాత భవనంలో నిరుపయోగంగా బెడ్లు

## అయ్యో కొడుకా

### ఒక్కగానొక్క కొడుకు మృతితో గుండెలవిసేలా రోదించిన తల్లి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 9 : 'అయ్యో కొడుకా.. మంచిగా చదువుతున్నావని పంపితే ఎంత పనాయె బిడ్డా.. నన్ను ఇట్ల వదిలేసిపోయావా నాన్నా.. సౌదీలో ఉన్న మీ నాన్నకు ఏం చెప్పాలి బిడ్డా' అంటూ ఎద్మల అనిరుధ్ (11) తల్లి గుండెలవిసేలా రోదించింది. ఉన్న ఒక్కగానొక్క కొడుకు చనిపోవడంతో మృతదేహంపై పడి గుండెలు బాదుకున్నది. వేములవాడ మండలం మర్రిమడ్లకు చెందిన ఎద్మల కృష్ణారెడ్డి – ప్రియాంక దంపతులకు అనిరుధ్ ఒక్కడే కొడుకు. కృష్ణారెడ్డి బతుకుదెరువు నిమిత్తం సౌదీకి వెళ్లగా, ప్రియాంక తన కొడుకుతో కలిసి తల్లిగారిల్లయిన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో ఉంటున్నది. అనిరుధ్ రెండేండ్ల క్రితం గురుకుల ప్రవేశ పరీక్ష సీటు సంపాదించడంతో పెద్దాపూర్ గురుకులంలో చేర్పించింది. మంచిగా చదువుతుండడంతో సంతోష పడింది. ప్రస్తుతం కొడుకు ఆరో తరగతి చదువుతుండగా.. సెలవు రోజుల్లో చూసి వచ్చేది. ఇలానే ఇటీవల వెళ్లి కొడుకుతో మాట్లాడి వచ్చింది. అంతలోనే చనిపోయాడన్న విషయం తెలిసి ఆ తల్లి జీర్ణించుకోలేకపోయింది. వెంటనే జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు చేరుకొని, బాలుడి మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదించింది. విషయం తెలిసిన వెంటనే బాలుడి తండ్రి సౌదీ నుంచి బయలుదేరినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.



మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న హేమంత్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి
- పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలి
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

జగిత్యాల/ మెట్‌పల్లి, ఆగస్టు 9 : పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థి అనిరుధ్ మృతి ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, అస్వస్థతకు గురైన పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో విద్యార్థి మృతదేహాన్ని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి పరిశీలించారు. విద్యార్థి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకు ముందు అస్వస్థతకు గురై మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న మల్యాల మండలం తాటిపెల్లికి చెందిన హేమంత్‌యాదవ్‌ను, నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన మోక్షిత్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనిరుధ్ కుటుంబంతో పాటు ఇటీవల మృతిచెందిన ఆరపేట గ్రామానికి చెందిన రాజారాపు గణాదిత్య కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో ఇలాంటి ఘటనలు రెండు సార్లు జరగడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఈ విషయమై అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాయిరెడ్డి, బీఆర్‌ఎస్ మల్లాపూర్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు శీలం ప్రవీణ్, బోయపోతు గంగాధర్, ప్రతాప్, బైరి రాకేశ్, రవి, నాయకులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్యుడు సూర్యనారాయణ రెడ్డి దంపతులు, చిత్రంలో సీఎంఆర్ సీఎండీ మావురి వెంకటరమణ, కెయిమ్స్ చైర్మన్ చలిమెడ లక్ష్మీనరసింహారావు

## కరీంనగర్‌లో మెరిసిన సినీతారలు

- సందడి చేసిన పాయల్ రాజ్‌పుత్, సంయుక్త మీనన్
- సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభానికి రాక



కరీంనగర్ విద్యానగర్, ఆగస్టు 9 : ఆర్‌ఎక్స్ 100 హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్, విరుపాక్ష హీరోయిన్ సంయుక్త మీనన్ శుక్రవారం కరీంనగర్‌లో మెరిశారు. గర్ల్స్ కాలేజీ రోడ్డులో ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చి సందడి చేశారు. ప్రముఖ వైద్యుడు సూర్యనారాయణరెడ్డి, కెయిమ్స్ చైర్మన్ చలిమెడ లక్ష్మీనరసింహారావు రిబ్బన్ కట్ చేసి, మాల్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాల్ నిర్వాహకులు, సీఎంఆర్ ఎండీ మావురి వెంకటరమణ మాట్లాడుతూ, కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మాల్ 32వదని, త్వరలోనే నిజామాబాద్, మేడ్చల్‌లో ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు అందరికీ అందుబాటు ధరల్లో వస్త్రాలు ఉన్నాయన్నారు. ₹99 నుంచి ₹50 వేల వరకు విలువైన చీరెలు ఉన్నాయని చెప్పారు. సినీతారలు పాయల్ రాజ్‌పుత్, సంయుక్త మీనన్ మాట్లాడుతూ, కరీంనగర్ బాగున్నదని, సీఎంఆర్ షాపింగ్ మాల్ చాలా బాగున్నదని హర్షం వ్యక్తం చేశారు. తమను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం సంతోషంగా ఉందని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పెద్ద సంఖ్యలో వచ్చిన అభిమానులకు అభివాదం చేశారు.

## నిషేధిత పదార్థాల కోసం వేట

### నగరంలో పోలీసుల తనిఖీలు

కరీంనగర్ రాంనగర్, ఆగస్టు 9 : నిషేధిత పదార్థాలకు అడ్డుకట్ట వేసేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు వేట సాగించారు. నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలంతో డాగ్‌స్క్వాడ్ బృందం కరీంనగర్–2 టౌన్ సీఐ సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు. శుక్రవారం నగరంలోని పార్సిల్ ఆఫీసులు, కిరాణా షాపులు, పాన్ షాప్‌లు, హాస్టళ్లు, అనుమానిత ఇండ్లలో తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడైనా నిషేధించిన గంజాయి, మత్తు పదార్థాలు ఉన్నా లేక విక్రయిస్తున్నట్టు సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని టౌన్ ఏసీపీ నరేందర్ తెలిపారు.



జాగిలంతో తనిఖీ చేస్తున్న పోలీసులు



కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో ధర్నా నిర్వహిస్తున్న అఖిలపక్ష కార్మిక నేతలు

## నియంతృత్వ విధానాలను అడ్డుకోవాలి

### 'సేవ్ ఇండియా నినాదం'తో అఖిలపక్ష సంఘాల ధర్నా

కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 9 : కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నియంతృత్వ విధానాలను అడ్డుకోవాలని అఖిలపక్ష రైతు సంఘాలు ప్రజలకు పిలుపునిచ్చాయి. ''క్విట్ కార్పొరేట్ బీజేపీ ప్రభుత్వం, సేవ్ ఇండియా' పేరిట అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ప్లకార్డు లు చేతపట్టి, గంటకు పైగా నినాదాలు చేశారు. ఈ సం దర్భంగా ధర్నాలో పాల్గొన్న రైతు సంఘాల నాయకు లు వర్ణ వెంకటరెడ్డి, పొనగంటి కేదారి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మికులు, కర్షకుల పొట్టగొడుతున్నదని దుమ్మెత్తిపోశారు. నేషనల్ మానిటైజేషన్ పేరుతో బడా కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వరంగ సంస్థలను విక్రయిస్తోందని ఆరోపించారు. ఇందుకు నిదర్శనమే దేశ వ్యాప్తంగా 61 బొగ్గు బ్లాకులను వేలం వేయడమన్నారు. ఈఎస్ఐ యాజమాన్య వాటాలు మాఫీ చేసిందని ధ్వజమెత్తారు. పారిశ్రామిక, వ్యవసాయ రంగాల కు బడ్జెట్‌లో అంతగా నిధులు కేటాయించలేదని విమర్శించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన రైతాంగ సమ్మె లో రైతులకిచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు చే యలేదన్నారు. గ్రామీణ వ్యవసాయ రంగాన్ని పూర్తిస్థాయిలో కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. నిరసనలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, ఐఎఫ్‌టీయూ జి ల్లా కార్యదర్శి జిందం ప్రసాద్, టీఎన్‌టీయూసీ జిల్లా కన్వీనర్ కళ్యాడపు ఆగయ్య, వ్యవసాయ కార్మిక సం ఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లరాజు, బీకేఎంయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోయిని అశోక్, సృజన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పునూటి శ్రీనివా స్, గుడికందుల సత్యం, రాజమళ్ళు, పున్నం రవి, సుంకరి సంపత్, రాయికంటి శ్రీనివాస్, రాజేశం, ఇట్ట మల్లేశం, రామకృష్ణారెడ్డి, కిషన్ పాల్గొన్నారు.

## నా సమస్య పరిష్కరించండి

మల్లాపూర్, ఆగస్టు 9 : మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన మర్రిపల్లి రాజగంగారం అనే దివ్యాంగుడు తన సమస్య పరిష్కరించాలని శుక్రవారం గ్రామంలోని ప్రధాన రహదారిపై అడ్డుగా పడుకొని వినూత్నంగా నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఇంటికి రోడ్డు, డ్రైనేజీ లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికీ అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, పలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. వారం రోజుల క్రితం మండల పరిషత్ కార్యాలయం ప్రధాన ద్వారం ముందు పడుకొని నిరసన తెలుపగా సంబంధిత అధికారులు తన సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి గాలికి వదిలేసినట్లు ఆరోపించారు. సదరు వ్యక్తి వద్దకు ఎస్ఐ కిరణ్‌కుమార్, ఆర్ఐ సురేష్‌కుమార్ చేరుకొని ఆందోళనకారుడిని శాంతింపజేశారు.

### ముత్యంపేట ప్రధాన రోడ్డుపై పడుకొని దివ్యాంగుడి నిరసన



రోడ్డుపై పడుకొని నిరసన వ్యక్తం చేస్తున్న రాజగంగారం

## పాలిసెట్‌లో స్పాట్ అడ్మిషన్లు

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 9 : పాలిసెట్–2024 స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డీ శోభారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు ఎస్సెస్సీ మెమో, ర్యాంక్ కార్డ్, కులం, నివాసం, ఆదాయం సర్టిఫికెట్లు, ఒరిజినల్ టీసీలతో ఈనెల 11 లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందిన వారు పోస్టు మ్యాట్రిక్ స్కాలర్‌షిప్‌నకు అనర్హులని తెలిపారు.